# అపమృత్యువు

పద్మావతీ నారాయణ్



ఆకాశమంతా దట్టమైన మబ్బులతో నిండి పోయింది. ప్రళయకాల ఝంఝా మారుతంలా తీవ్ర ప్రభంజనం వీవసాగింది. భూమ్యాకాశాలు దద్దరిల్లేలా ఘోషపెడుతూ — "ఫెళ, ఫెళ" మంటూ ఘర్జిస్తున్నాయి మేఘాలు. తళుక్కు తళుక్కున తటిల్లతలు ఆకాశాన్ని చీల్చుకుని కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతితో కనిపించి, క్షణంలో మళ్లీ మాయమై పోతున్నాయి.

చిటపటమంటూ చినుకులు ప్రారంభమైనాయి. వరుణదేవుని ఆక్రోశంతో ఒక్క క్షణకాలంలో ప్రకృతి అంతా భీతావహంగా మారిపోయింది. చిటపటతో ప్రారంభమైన చినుకులు దివినుండి భువిదాకా ఒకే గొలుసులా పడుతూ చూస్తుండగానే ధారాపాతంలా మారి పోయింది.

తళుక్కున ఒక్క మెరుపు మెరిసింది. ఆ వెను వెంట దిగంతాలు ప్రతిధ్వనించేలా ఒక్క ఉరుము ఉరిమింది. దానితోపాటే కఠోరమైన శబ్దం చేసుకుంటూ ఒక్క పిడుగు పడిపోయింది.

"అమ్మో!" అంటూ నేలకూలిపోయాడు. భాస్కరం.

క్షణకాలం తరువాత తేరుకున్నాడు. "ఆ పిడుగు తన నెత్తిన పడలేదు. ఆకాశ దేవత అని కరుణించింది. లేకపోతే తనిపాటికి అపమృత్యువు కౌగిలిలో అంతిమ నిశ్వాస విడిచి వుండేవాడు.

భాస్కరం లేచాడు. క్రిందపడినప్పుడు తన ఒంటికి అంటుకున్న బురదని ప్రక్కనే గుంటలో నిలచి వున్న నీళ్లతో కడిగి శుభ్రం చేసుకుని మళ్లీ నడక ప్రారంభించాడు.

భాస్కరం స్టేషనులో దిగినప్పుడే వర్షం వచ్చే సూచనలు కనిపించాయి. కాని అతనికి ఆరాత్రి అక్కడ నిలబడడం సుతరామూ ఇష్టం లేదు. అది ఒక కుగ్రామం ప్రక్కనవున్న ఓ చిన్న స్టేషను. "ఇంకా నాలుగు బారల పొద్దు వుంది. యీలోగా యిల్లు చేరుకోవచ్చు. ఎటూ తను వెళ్లవలసినది కూడా అట్టే దూరం లేదు. మహా అంటుతే మూడు రాళ్లుంటుంది. అనుకుని వచ్చాడు. తీరా సగం త్రోవలోకి వచ్చే సరికి వర్షం పట్టుకుంది.

"తను ఇంటికి ఎంత త్వరగా వెళ్ళితే అంత మంచిది. లేకపోతే చరమదశలో వున్న తల్లిని చూసే అవకాశం కూడా లేకపోవచ్చు." యీ ఒక్క ఆలోచనే అతణ్ణి అంత వానలోను నడిపించుకు పోతున్నది. తల్లి మరణవేదన పడుతూ తనకోసం ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ఎదురు చూస్తూ వున్నట్లుగా అనిపించింది. ఆదృశ్యమే అతని కళ్లకి లీలా మాత్రంగా గోచరించింది. ఆ భ్రాంతితో అతనిలోని ఉద్వేగం విజృంభించి పోయింది. అందుకే అతను ధారాపాతంలా పడుతున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చలికి నరాలు నీలుక్కుపోయి ఎముకలు కొరికేస్తున్నా యంత్రంలా నడచిపోతూనే వున్నాడు.

అలా పదిహేను నిమిషాలు నడిచాడు. అప్పటికి వర్షం వెలిసిపోయింది. చీకటి పడుతూంది. ఆకాశంలో ఓ మూలగా ఎక్కడో రక్తారుణ వర్ణ సంజవెలుగులు గోచరిస్తున్నాయి. ద్విజ కులాలు కిలకిలారావాలు చేస్తూ అప్పుడే రెక్కలు విప్పుకుని ఆకాశంలోకి ఎగురుతున్న చెదపురుగుల్ని పట్టి భక్షిస్తున్నాయి. మరికొన్ని పక్షులు గూళ్ళకి చేరుకుంటున్నాయి. వర్షంలో తడిసిపోయిన తమ రెక్కల్ని విదిలిస్తూ 'టపటప' శబ్దం చేస్తున్నాయి. చెదపురుగుల పుట్టకళ్లంత దూరంలో వుండి పైకి వచ్చిన వాటినన్నిటినీ నాలుక చాచి, అందుకుంటున్న కప్ప ఒకటి, అటుప్రక్కన అత్తిచెట్టులోంచి ఒక పండు నోట కరచుకొని క్రిందికి దిగి వచ్చిన ఉడతని చూసి చటుక్కున ఎగిరి పడింది. అప్పుడే త్రోవలోకి వచ్చి అటు— ఇటు చూసిన నక్క అల్లంత దూరంలో వస్తున్న భాస్కరాన్ని గమనించి ప్రక్కనే వున్న ఈశ్వరయ్య గారి చెరుకు తోటలోకి పారిపోయింది. భాస్కరం ఇవేవీ గమనించకుండా అన్యమనస్కంగా అడుగులు వేస్తూనే వున్నాడు.

చింతల తోపుని సమీపించేసరికి సంజ చీకట్లు బాగా అలుముకున్నాయి. ఆకాశంలో ఎక్కడా అశాశ్వతమైన ఓ చిన్న కాంతిరేఖ కూడా కనిపించడం లేదు. తోపులోని చింత చెట్లు తలలు విరియబోసుకున్న దెయ్యాల్లా కనిపిస్తూ భీతిని గొల్పుతున్నాయి. అసలే చీకటిగా వుంది. ఆ తోపులోకి వచ్చేసరికిఅంధకారములుముకుపోయి దారికూడా కన్పించడం కష్టమై పోయింది. దాదాపు మూడు ఫర్లాంగుల వైశాల్యం కలిగిన పెద్దతోపు అది. దానిమధ్యగుండానే నడచి వెళ్ళాలి. ఆతోపు తూర్పువేపు కొసన ఒక శివాలయం వుంది. అక్కణ్ణుంచి భాస్కరం వాళ్ళవూరు సరిగా ఒక మైలు.

"తనీ ప్రాంతాలకి వచ్చిన తరువాతనైనా వర్షం తప్పి వుంటే బాగుండేది. కానీ అలా జరుగలేదు" అనుకున్నాడు ఆలయాన్ని సమీపించి అటువేపు చూస్తూ భాస్కరం.

తను ఉన్నతవిద్యాభ్యాసం కోసం హైదరాబాదు వెళ్ళి, ఉస్మానియా కాలేజీలో చేరి, యిప్పటికి సరిగా ఆరు సంవత్సరాలు కావస్తోంది. ఈఆరు సంవత్సరాల కాలంలోనూ మళ్లీ ఎప్పుడూ తన స్వగ్రామం తిరిగి రాలేదు. అమ్మ చాలా సీరియస్‌గా వుందని నాన్న యిచ్చిన వైరందుకుని, ఈనాడే మళ్లీ ఈ జన్మభూమిలో అడుగుపెడుతున్నాడు. బాల్యంలో ఒక రోజు తనూ, ప్రభాకరం, శేషూ, శ్రీధర్ అందరూ కలసి, ఈశివాలయానికి వచ్చి, వెంట తెచ్చుకున్న పాకంపప్పు వుండలు, చేగోడీలూ తిని, బసవన్న నోటిగుండా ప్రవహించే, మధుర జలాలను కడుపునిండుగా త్రాగి, మిట్ట మధ్యాహ్నపు గ్రీష్మతాపాన్ని భరించలేక, ఆలయ మండపంలో కొంతసేపు పడుకుని విశ్రాంతి తీసుకుని, భాస్కరుడు కాస్త శాంతుడైనాక, ఆలయపు వెనుక భాగంలో వున్న కానుగ చెట్టుమీద 'కోతికొమ్మచ్చి'లాడి సంజవెలుగు యిళ్లు చేరుకున్నారు. అప్పుడే తను ప్రభాకరన్ని చెట్టుమీద నుంచీ క్రిందికి తోసేశాడు.ఆదెబ్బతో అతనికి కాలు బెణికి, పది, పదిహేను రోజులదాకా, నడవడానికి కూడా చాలా అవస్థపడ్డాడు పాపం. ప్రభాకరం చాలా మంచివాడు. తను హైదరాబాదు వెళ్తున్నప్పుడు కూడా స్టేషనుదాకా వచ్చి తనని రైలెక్కించి, విడువలేక, విడువలేక, కనుమరుగై పోయేవరకూ తనవేపే చూస్తూ, చివరికి బాధగా వెళ్ళిపోయాడు. అంతటి అవినావ భావ సంబంధమైన ప్రేమ వుండేది ప్రభాకరానికి తనపట్ల. ఇప్పుడెలా వున్నాడో పాపం!"—

ఈవిధంగా కొన్ని బాల్యస్మృతులు అతడు నిలబడుకున్న ఆ క్షణ కాలంలోనే చలనచిత్ర రూపాన్ని సంతరించుకుని, ఒక్కటొక్కటిగా అతని మనో నేత్రాల ముందు కదలిపోతూయి.

"ఈ పరిస్థితిలో ప్రతిక్షణమూ అమూల్యమైనది. అలాంటి కాలాన్ని గత స్మృతులతో వ్యర్థంగా గడుపరాదు" అనుకుంటూ, ముందుకు రెండడుగులు వేశాడు భాస్కరం. కళ్ళు మిరుమిట్లు గొలిపేలా తళుక్కున మెరుపు మెరిసింది. ఆ వెలుగులో అతనికి ఆలయం ముందున్న నంది విగ్రహానికి చేరగిలబడి, ఎవరో వున్నట్లు గోచరించింది.

"ఎవరక్కడ?" అన్నాడు.


".. .. .. .. ... ."

"ఎవరక్కడ?" ఇంకొంచెం హెచ్చుస్థాయిలో గట్టిగా అరిచాడు.

". . . ... ... ... ..."

"భాస్కరానికి అనుమానం వేసింది. పదు గజాల దూరంలోవున్న ఆ వ్యక్తి ఎంత చెవిటివాడైనా, తన రెండో పిలుపుకి సమాధానం యియ్యవలసింది. కానీ, అతను ఉలకలేదు పలకలేదు. "ఈ నిశీధంలో ఒంటరిగా అక్కడ నిలబడవలసిన అవసరం ఎవరికొచ్చింది? ఆవ్యక్తి ఎవరై వుంటాడు?" ఈ ఆలోచన కలుగగానే అతను ఆవ్యక్తి కనిపించిన వేపుకి, రెండడుగులు వేశాడు. అంతలోనే "అమ్మా" అని మూలుగుతూ క్రింద పడిపోయాడు—

"పిలిచినా పలక్కుండా ఆ వెధవ నందివిగ్రహం కాడే నక్కివుండి, తనని తలమీద బలంగా మోది, జేబులోని పర్సు తీసుకుని పారిపోయాడు. ఆపర్సులో వున్న ముష్టి ముప్పయిరూపాయలు పదిహేను నయాపైసలతో తన వికృష్ట జీవితమెన్నాళ్ళు గడిచి పోతుందనుకున్నాడో? హుఁ...





స రి గ మ ప ద ని స ... — సుందరం

"ఒరేయ్ గంగులూ!.... ఆ పోలిసాడు వుండలా వాడేరా, వాడు—రాఘవులు అని. నీకు తెల్దా? ఆయాల మన వూళ్లో సారాయి కేసులు పట్టు కోనురాలా? అప్పుడు యెంకణ్ణి బెదిరిచ్చి సారాయి ముత్తా తాగేసినత్తా, ఎయికం తప్పి కొడు తూంటే పడుతూ లేసుత్తా వచ్చి యీడపడి సచ్చినాడంట గందరా వాడు దెయ్యమై ఈ దోవన వచ్చి పోయ్యే వాళ్లని ఏడిపిస్తాడంటరా. అప్పటేల నించీ మసక మసకగాఅయితే మంచి మంచోళ్లు గూడా ఈ దోవన రాడాన్కి భయపడతారంట. ఈ యిసయం నిజమేనంటావా?"

"అదే మోరా బాబూ! అట్టా పాడు మాట్లు యియ్యాలప్పుడు సెప్పకరా....నాకుఒళ్ళు జలవరం అవుద్ది. పేణా లేసి పోతుండాయి. పూరోక్కరా నాగులూ! నీకు పుణ్యం వుంటుద్ది"

"అవులే, వాడు దెయ్యమయి ఈడ ఎరిపి సేద్ది నిజమేనంటావా?"

"అదిగందా! మళ్ళీ అవూటే! వద్దురా నాగులూ....నీకుదణ్ణం పెడతా! నోరుమూసుక్కు నడరా".

ఈ ధోరణిలో మాట్లాడుకుంటూ, యిద్దరు వ్యక్తులు వస్తున్నారు. పద ధ్వనినిబట్టి వాళ్ళు బాగా దగ్గిరగా వచ్చినట్టు గుర్తించుకుని, "దారిన పోతున్నదెవరు? ఇలా ఒక్కసారి రండి" అని పిలిచాడు భాస్కరం.

"ఒరేయ్! నాగులూ..... ఆ పోలిసాడి దెయ్యమే రా యిది. పరుగుచ్చుకోరా బాబూ! పెరుగుచ్చుకో! అలస్యం చేస్తే పేణాలు పోతాయి" అంటూ పిక్కబలం చూపించి వచ్చినదారిని బట్టి పరుగెత్తి పోయాడు గంగులు. నాగులకి కూడా వాణ్ణనుసరించక తప్పలేదు.

వాళ్ళ సాయంతో పరంధామయ్య మృత దేహాన్ని సులభంగా తీసుకుపోవచ్చు ననే ఉద్దే శంతో వుండిన భాస్కరం వాళ్ళు తనని దెయ్యంగా భావించి, పారిపోయినందుకు చింతించాడు.

"ప్రాణ భీతి మానవుణ్ణి పిరికి పందలా మార్చి వేస్తోంది. ప్రాణంమీది తీపితో పారి పోయే మానవునికి "ఈనాడు కాకపోయినా రేపైనా చావవలసినదే కదా!" అనే సత్యాన్ని అప్పట్లో గుర్తుకు రానీయదు. అది మానవుణ్ణి చావనియ్యడంలేదు. తాత్కాలికంగా తన ప్రాణాన్ని రక్షించు కోడానికే చూసిస్తాడు మానవుడు. ఈవిషయంలో ఒక్క మానవుడేకాదు. జీవంవున్న ప్రతి ప్రాణి అలానే చేస్తోంది. ఏమిటో? వెర్రి లోకం" అనుకున్నాడు భాస్కరం వేదాంతిలా.

ఎంతరాత్రి గడిచి పోయిందో భాస్కరానికి కునుకు రావడానికి ప్రారంభించింది. కూర్చుంటే బహుశా నిద్రవచ్చేస్తుందేమోనని లేచినిలబడ్డాడు. ఇలా రాత్రంతా కూర్చుని వుండేందుకంటే, వూళ్ళోకివెళ్ళి నలుగుర్ని పిల్చుకొస్తే బావుణ్ను" అనుకున్నాడు వెంటనే "తనలా వూళ్ళోకి వెళ్లే సరికి ఈ శవాన్ని కాస్తా నక్కలు ఈడ్చుకు పోతాయేమోనన్నఅనుమానం వచ్చి, ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

చాలా సేపటికి మళ్ళీ ఎవరోవస్తున్నట్లు తెలుసుకుని వాళ్ళు బాగా దగ్గరగా వచ్చిన తర్వాత "ఎవరు బాబూ వెడుతున్నది? ఎక్కడికి వెడు తున్నారు" అన్నాడు. "అమలాపురం సంతలో ఎడ్లనమ్మేసి వస్తున్నాం బాబూ! మాది నాగాయ లంక ఇప్పుడక్కడికే వెడుతున్నాం!" అన్నారు వాళ్ళు.

"అలానా బాబూ! అయితే యిల్లారండి! మీవూరి పరంధామయ్య లేడూ? ఆయన్ని ఎవడో ఈ నందివిగ్రహం కాడ పొంచివుండి యిందాక వానలో పీకనులిమి చంపేశాడు. నన్నుగూడా తలమీద బలంగా మోది పారి పోయాడు. ఇప్పుడాయన మృత దేహాన్ని మనం తీసుకెళ్ళాలి" అన్నాడు భాస్కరం.

కంఠ స్వరాన్ని పోల్చుకుని వాళ్ళు —"ఆఁ.. మువ్వా భాస్కరం బాబూ? యింతరాత్రిలో యిక్కడేం చేస్తున్నావు?" అని ఆశ్చర్యపోతూ అడిగారు.

"అమ్మ జబ్బుగా వుందని నాన్న తంతి యిచ్చారు. వెంటనే బయలుదేరి రమ్మని ఆత చూసుకుని వస్తున్నాను. తీరా యిక్కడికి వచ్చే సరికి దారిలో ఈ అవాంతరం వచ్చిపడింది".

"ఆయన్ని చంపినవాడికి మంచిగతి రాదు బాబూ! చాలా మంచివాడు పాపం! విరోధు లంటూ లేనిమానవుడు" అని సానుభూతి చూపి కారు వాళ్ళు.

"మీదగ్గిర నిప్పుపుల్లవుందా?" భాస్కరం అడిగాడు. "లేదు బాబూ! మాయిద్దరిలో ఎవరికి బీడీ అలవాటు లేదు.

"పోనీలెండి" భాస్కరం యిందాక తను పిలిస్తే భయపడి పారిపోయిన వ్యక్తుల్ని గురించి వాళ్ళకి చెప్పి "ఈ విధంలో వాళ్ళుపుని మీ



ఇప్పుడే నిద్రలేచా ! —— ఫోటో సుందరం

కూడా అలానే పారిపోతారేమో అనుకున్నాను'' అన్నాడు.

''మేమంత పిరికి వాళ్ళంకాదు బాబూ!'' అని వాళ్ళు తెచ్చుకున్న దుప్పటితో 'జోలి' కట్టి, దాన్లో పరంధామయ్య మృతదేహాన్ని పడుకో బెట్టారు. వెంట తెచ్చుకున్న లావుపాటి వెదురు పేతికర్రను జోలీలోకి దూర్చి, కర్ర కొనల్ని భుజంమీద వుంచుకొని మెల్లగా నడవడం ప్రారంభించారు.

భాస్కరం వాళ్ళ వెనకాలే నడుస్తున్నాడు.

''బాబుగారూ! కాస్త జాగ్రత్తగా అడుగు వెయ్యండి. దారి జారుడుగా వుంది. చీకటిలోనైనా మేము ఈ దారిని కళ్ళుమూసుకుని నడచిపోగలం నిత్యం వస్తూ పోతూవుంటాము కాబట్టి మాకు ఈ పరిసరాలంతా సుపరిచితాలే అన్నారు వాళ్ళు.

''ఆమాటలలోనూ సత్యం లేకపోలేదు. తను స్వగ్రామం విడిచి వెళ్ళిన తర్వాత ఈ నాటివరకూ మళ్ళీ యీదారినరాలేదు. ఈ లోగా ఎన్నిమార్పులు కలిగాయో తనకేం తెలుసు''.

''అలాగే!'' అన్నాడు నెమ్మదిగా భాస్కరం.

తర్వాత ఎవరూ ఏమీ మాట్లాడ లేదు. నిశీథాన్ని చీల్చుకుని నెమ్మదిగా నడిచి పోతున్నారు. పది నిమిషాలలో వూరు దగ్గరికి చేరుకున్నారు.

భాస్కరం వాళ్ళ యిల్లు శ్రీపతిరావు వీధి మొదట్లోనే వుంది. అక్కడికి వెళ్ళడానికి అట్టే వూరిలో దూరిపోనక్కరలేదు. ఒకటి రెండు మలుపులు తిరిగితే అదే శ్రీపతి రావు వీధి.

వూళ్ళో అడుగు పెట్టగానే ఏదో కుక్క ''భవ్! భవ్!'' మంది. భాస్కరం శవవాహకులకంటె ముందువెళ్ళి పరంధామయ్య మృత దేహాన్ని వరండాలో దింపమన్నాడు ఇంట్లో అలికిడేమీ వినిపించలేదు. అతనికి కాస్త అనుమాన మేసింది. అమ్మ దాటిపోయిందేమోనని. ఎవర్నీ పిలవకుండా లోపలకు వెళ్ళాడు.

''ఏమిటోయ్ భాస్కరం! నువ్వట్రా? మీ శంకరం మావయ్యేమో ననుకున్నాను. ఆయనా ఈవాళ వస్తానని రాశాడు. కానీ ఎందు చేతనో యింకా రాలేదు. బహుశా రేపు వస్తాడేమో?— మీ అమ్మకి కాస్త స్థిమితంగా వుంది. ఇప్పుడే పళ్ళరసం త్రాగి నెమ్మదిగా పడుకుంది—కానీ నువ్వు ఇంతరాత్రిలోనట్రా రావడం'' అన్నాడు భాస్కరం నాన్న.

''ఇంత చీకట్లో ఒక్కడివే ఎలా వచ్చావురా అన్నయ్యా'' నీకు భయం వెయ్యలేదూ?'' ఆశ్చర్యంతో అడిగింది చెల్లి.

''నేనొక్కన్నే రాలేదు. నావెంట ముగ్గు రొచ్చారు చెల్లీ''.

''ఏరిరా—వాళ్ళు?''

''వసారాలో వున్నారు. అందులో ఒకరు ప్రాణంలేని పరంధామయ్య. ఇక ఇద్దరూ ఆయన వాహకులు''.

''ఆఁ! ...... ఏమిటి నువ్వంటూంట? ప్రాణంలేని పరంధామయ్యా? ఆయనకేమైం దేమిటి?

''ఆయనకేమీ కాలేదు. కానీ ఎవడో దానవుడు మనవూరిముందర శివాలయం లేదూ? అక్కడ ఆయన్ను పీకనులిమి చంపేశాడు. మంచి కాలం గాబట్టి సరిపోయింది. లేకపోతే నేనూ యీ పరికి పరంధామయ్య ననుసరించి వుండేవాణ్ణి! వాడు కొట్టిన దెబ్బకి నాతల తిరిగి స్పృహతప్పి పడి పోయాను కానీ—చావలేదు''.

''ఆఁ! అంత పని జరిగిందా!'' అంటూ భాస్కరం నాన్న లేవబోయాడు. కానీ స్నేహితుని మరణవార్త ఆయనలోని శక్తిని చంపివేసింది. మళ్ళీ అలానే చతికిలబడ్డాడు.

పార్వతి హరికేన్ లాంతరు పుచ్చుకుని వసారా లోకి వచ్చింది. ఆమె వెనకాలే భాస్కరంకూడా వచ్చాడు. లాంతరు వెలుగులో పార్వతి శవంకేసి చూసి ''ఇదేమిటి? జుట్టంతా సురిగిపోయి వుందే! అంది.

''ఆఁ జుట్టంతా సురిగి పోయివుందా?'' అంటూ భాస్కరంవచ్చి చూసి—'' అయ్యో! యిందాకా ఈయన్ను ఎవరో పీకనులిమి చంపే శాడనే అనుకుంటూన్నాను. ఇప్పుడు తెలుస్తోంది ఈయనచావుకికారణం పిడుగుపడిచనిపోయాడు. నన్ను తలమీదమోది పారిపోయిన వాడి కసలు పరంధామయ్య అక్కడున్నట్టు కూడా తెలి తెలియదేమో!వాడిమీద వూరికినే అపోహపడ్డాను. ఆవరకే పరంధామయ్య అపమృత్యువు కవుగిలిలో అంతిమశ్వాస విడిచి వుంటాడు. అసలా పిడుగువాత పడవలసింది ఆయనకాదు. నేను. ఆకాశదేవత నన్ను కరుణించింది. కటాక్షించింది'' అన్నాడు భాస్కరం.

శవవాహకులు యింకా నుంచునే వున్నారు. పార్వతి లాంతరు తీసుకుని మళ్ళీ యింట్లోకి వెళ్ళుతూ వుండగా వాళ్ళనాన్న కూడా అక్కడికి వచ్చాడు. ''వీళ్ళతో నేనూ నాగాయలంక వెళ్ళి ఈ శవాన్ని వాళ్ళకిప్పజెప్పి వస్తాను నాన్నా!'' అన్నాడు భాస్కరం!

''పరంధామయ్య మృత దేహాన్ని కడసారిగా నేనూ ఓమారు చూస్తానువుండు బాబూ! ఆనక తీసుకుపోదూగానీ'' అని సమీపించి సురిగిపోయి ముఖంమీదఅడ్డంగాపడివున్నవెంట్రుకల్నిప్రక్కకు తీసి పరీక్షగా చూశాడు. అలా చూస్తూండగానే ఆయన నేత్రాలనుంచి ధారగా కన్నీళ్ళు కార సాగాయి. మిత్రుని మరణం కోసం దుఃఖ క్లేశ మనుభవిస్తున్న తండ్రిని చూచి భాస్కరానికి దుఃఖం పొంగు కొచ్చింది. ''భాస్కరం! ఈయన పరంధామయ్య కాదు. మీ శంకరం మామయ్య అన్నాడాయన అతి ప్రయత్నం మీదదుఃఖాన్నాపు కుంటూ.

''ఆఁ! .....'' అంటూ భాస్కరం అలానే స్థాణువులా నిలబడి పోయాడు. అతని నోటినుంచి వెలువడిన అబాధా మిళితశబ్దాన్ని మోసుకుంటూ మందవాయువులు ఆ నిశ్శబ్ద నిశీథంలో కలసి పోయాయి.